నీ కన్నీటితో నన్ను బంధించకు

—అందే భాగ్యలక్ష్మి



రాత్రి పన్నెండు గంటల ప్రాంతం... అమావాశ్య మరుసటి రోజు శ్మశానవాటిక. ఓ మూలగా పార్వతి సమాధి ప్రక్కన మోకాళ్ళమీద తల పెట్టుకుని విచారిస్తూ కూర్చున్నాడు సుబ్బారావు...అతనికి పూర్వం 'శ్మశాన' మంటే ఎంత భయమో! కాని,......

ఇప్పుడు?...ఇప్పటికి మూడు రోజుల నుండీ నిద్రాహారాలు మాని, వాతావరణ మార్పులను గమనించకుండా, పరిసరాల ప్రభావానికి లొంగిపోకుండా అదే శ్మశానంలో...పార్వతి సమాధి ప్రక్కనే కూర్చుని ఉన్నాడు. పార్వతిని అతను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు ఆమె వొక పసిపిల్లవాణ్ని ప్రసాదించి మరణించింది.

పూర్వం పార్వతితో కలసి పార్కుల్లో తిరుగుతూ గంటలు గంటలే గడిపేవాడు సుబ్బారావు' ఈనాడు పార్వతి సమాధితో శ్మశానంలో రోజులు రోజులే గడుపుతున్నాడు ' ఓ నాడు పార్వతి కాటుక కళ్ళల్లో తన చిరునవ్వు మోము ప్రతిబింబాన్ని చూసుకొని ఆనందించాడు . ఈనాడు పార్వతి సమాధిని తన కన్నీటితో కడిగి, అందులో కృంగి కృశించి పోయిన తన వికార వదనపు ప్రతిబింబం చూసుకుని విచారిస్తున్నాడు

నిద్రాహారాలు లేనందువల్ల శుష్కించి పోయిన అతని ముఖం, మాసిన గెడ్డంతో వికృతంగా తయారైంది...తైల సంస్కారం లేని ఆతని గిరజాల జుట్టు రేగిపోయి గాలికి చిందరవందరగా ఎగురుతూంది ఏడ్చి ఏడ్చి, అతని కళ్ళు ఎర్రగా ఉబికి, నిప్పుకణాల్లా మారిపోయినయ్ .గాలికి రివ్వుమని గట్టిగా ఊగుతున్న జువ్విచెట్టు కొమ్మల మధ్యనుంచి, ఆగి ఆగి వస్తున్న మెరపుల కాంతిలో భయంకరంగా కన్పడుతున్నాడు సుబ్బారావు

వికృత ధ్వని చేస్తూ సుబ్బారావు మీదుగా ఎగిరిపోయిందొక గుడ్లగూబ... నిశ్చలంగా కూర్చున్న సుబ్బారావు తల పైకెత్తాడు ..

"ఏయ్ సుబ్బారావ్ !"

ఉలిక్కిపడ్డాడు సుబ్బారావు అటూ ఇటూ కలయజూసాడు...చుట్టుప్రక్కల ఎవరూ కన్పించకపోయేసరికి అదిరిపోయాడు...'భ్రమ' అనుకుని తనను తాను సంబాళించుకోబోయాడు

మళ్ళీ అదే పిలుపు..."ఏయ్ సుబ్బారావ్ '" ఆకలిబాధ, నీరసం కలిసి కోపంగా మారినయ్ అతనిలో. ధైర్యంగా అన్నాడు – "ఎవరు నువ్వు ?"

"పిచ్చివాడా.. ఆమాత్రం నువ్వు నన్ను గుర్తించలేకపోయావా ?"

"ఎవరు నువ్వు ? ఎక్కడి నుంచి మాట్లాడుతున్నావ్ ? ఎందుకలా నన్ను భయపెడ్తావ్ ? నిన్నేం చేసేను ? నీకేం .." నీరసంగా గర్జించాడు సుబ్బారావు

"సుబ్బారావ్ ' నిన్నేం భయపెట్టడం లేదే !...అయినా నిన్ను నేనా భయపెడతాను ? సుబ్బారావ్, అప్పుడే నన్నంతగా మరచిపోయావా ?''

"ఇంతకీ ఎవరు నువ్వు ?..... . ఎందు..." ఉద్రేకంగా ఇంకా ఏదో అనబోయి, అనలేక ఆగిపోయాడు సుబ్బారావు

"ఉహ్...నేనా ? . నీ పార్వతి 'ఆత్మ'ని సుబ్బారావ్ '"

"ఆఁ !"

"కంగారుపడకు సుబ్బారావ్ ' నేనింకో శరీరంలో ప్రవేశించే నిమిత్తం బయలుదేరాను...కాని, నీ కన్నీరు నన్ను బంధించింది "

"పార్వతీ. !"

"పోరబడుతున్నావ్ సుబ్బారావ్ ఇక నీ పార్వతి దేహానికీ, నాకూ సంబంధం లేదు...ఇప్పటివరకూ నీ పార్వతిలాంటి దేహాల్లో ఎన్నింటిలోనో ప్రవేశించాను .. ఇప్పుడింకో దేహంలో ప్రవేశించబోతున్నా కానీ, మూడు రోజులనుండీ అదేరీతిగా కూర్చుని విచారిస్తున్న నిన్ను పలుకరించకుండా వెళ్ళిపోవటం నా ధర్మంకాదని .."

"ఏం? నన్ను పలకరించి ఏం చేస్తావ్?"

"ఉద్రేకపడకు సుబ్బారావ్! .. ఇదిగో చూడు, నీకు శ్మశానమంటే భయం లేదూ?"

"నా ప్రియ పార్వతిని పొట్టను బెట్టుకున్న దీ పాడు శ్మశానమేగా! అమ్మో! .. అదంటే. ." వణికిపోతూ అన్నాడు సుబ్బారావ్

"మరయితే ఈ శ్మశానంలో ఒంటరిగా అలా విచారిస్తూ కూర్చున్నావేం?"

"నా పార్వతికోసం నా పార్వతి లేని జీవితం నాకు విచారం కాక మరేమిటి?.." బాధగా తల అటూ ఇటూ త్రిప్పుతూ, కన్నీరుకూడా లేని కళ్ళను మూసుకుంటూ అన్నాడు సుబ్బారావు

"పిచ్చివాడా! . శ్మశానమంతటి సుందరమైన స్థలంలో పార్వతి కలిసిపోతే అలా విచారిస్తావెందుకు?"

"ఏమ్! ..ఏమంటున్నావ్? శ్మశానం సుందరమైన స్థలమా? ఈ



"నన్ను కోతిని చేద్దామని ప్రయత్నిస్తున్నావా?"
"దానికి ప్రయత్నం దేనికి?"

గాడాంధకారం, ఈ అస్థిపంజరాలు, బొమికలు, ఎముకలు...పుర్రెలు... దుర్గంధం ... పశుల కళేబరాలు... ఛాఛాఛా .."

"అవన్నీ అశాశ్వతాలు సుబ్బారావ్! రెండుమూడు రోజులకి అవికూడా రూపుమాసి పోతాయ్ 'శ్మశానం సుందరమైన స్థలమా' అంటున్నావా? మరికాదూ... చూడు ..ఆ ప్రకృతి ఎంత గగుర్పాటును కల్గిస్తుందో! . ఆ మెరపుల మధ్య ఆ జువ్విచెట్లు, వాటి కాంతిలో ఆ బిళ్ళ గన్నేరు పూలు...ఆహా! ..సుబ్బారావ్! 'సౌందర్యం, ఆనందం, అనుభూతి' అనే మాటలని ఎప్పుడైనా విన్నావా?"

"ఏమో ....."

"అయితే విను ..'సౌందర్యం' అనేది గలగలపారే సెలయేటిలోనేకాదు, నిశ్చలంగా నిలుచున్న పర్వతంలో కూడా గోచరిస్తున్నది కిలకిలలాడే పక్షుల్లోనే కాదు, మౌనంగా నిలుచున్న గోమాతలో కూడా కన్పిస్తుంది .. ప్రకృతిలో ప్రతి

నిత్యమూ ప్రతిధ్వనించే భయంకర సింహ గర్జనలోనే కాదు, 'ఉష్' అంటే పారి పోయే చిట్టెలుక పరుగు 'సవ్వడి' లో కూడా అగుపడుతుంది. . సుబ్బారావ్! ప్రవహించే నది దారిలోఉండే కొండ రాళ్ళ విరహగీతాల్ని వినిపించి తన హృదయ భారాన్ని దూరం చేసుకునేం దుకు ప్రయత్నిస్తుంది ... కాని అవి ఆ గీతాల్ని లక్ష్యపెట్టవుగా...నీ పార్వతి సమాధికూడా నీ కన్నీటి వెచ్చదనాన్ని లెక్కచేయదు సుబ్బారావ్ '...చూడు ఈ మెరపుల కాంతిలో నీ పార్వతి సమాధి ఎంత అందంగా కన్పడుతుందో' ఈ ప్రకృతిని చూస్తుంటే నీకు 'ఆనందం' కల్గటంలేదూ? 'సౌందర్యం' 'ఆనందం' కలిస్తే 'ఓ అనుభూతి' కల్గుతుంది...అది ప్రస్తుతం నీకు కలుగకపోవచ్చు... కారణం – పవిత్రమైన ఈ శ్మశానంలో నీ పార్వతి కలిసిపోయిందనే విచారం "

"ఏమంటున్నావ్? ... 'శ్మశానం' పవిత్రమైనదా •...నీవు 'ఆత్మ'వి...ఓ దెయ్యానివి..." కోపంగా, ఉద్రేకంగా అన్నాడు సుబ్బారావు

"పొరబడుతున్నావ్ సుబ్బారావ్! శ్మశానం, 'సమానత' అనే సందేశాన్ని మౌనంగానే ఉండి సంసారానికి అంద జేస్తుంది ... నోళ్ళు పెగలదీసుకుని ఏ నాయకుడు ఏ ప్రజాస్వామ్య పరిపా లనలో ప్రతివాడికీ సమాన హక్కులిస్తు న్నాడు? .. ఈ శ్మశానవాటిక నోరు మెదపకుండా, మూగగా కూర్చుని ప్రతి వ్యక్తికీ, కులమత భేదాలు పాటింప కుండా, గొప్ప, బీద తారతమ్యం చూప కుండా, ఆబాల గోపాలానికి సమానమైన ఆదరాన్ని చూపెడుతుంది. 'సమానత' అనేపదానికి అర్ధమే 'శ్మశానం'! కష్ట సుఖాలతో నిండిన జీవితమనే బాటమీద ప్రయాణంచేసే ప్రతి ప్రాణికీ గమ్య స్థానం శ్మశానమే' సాంసారిక వాంఛ లకు లోబడి, పాపాలు చేసి, కలుషితం చేసిన శరీరాన్ని ఈ శ్మశానంలోనే ప్రతి ప్రాణీ భస్మం చేస్తుంది సుబ్బారావ్' ఒక్క 'కపాలపు ప్రేలుడు' తో మోక్షం ప్రసాదించే దీ శ్మశానమేగదా' వింటు న్నావా సుబ్బారావ్?"

"ఆఁ..."

"ఇయితే ఇంకా విను ..శ్మశానం పవిత్రమైన స్థలమని ఎందుకు అనబడు తుందో చెబుతా..., ఓపిగ్గావిను సుబ్బా రావ్...నాలాంటి 'ఆత్మలు' తమ తమ వికాసానికై అనేక శరీరాల్లో ప్రవే శిస్తుంటయ్...అన్నట్టు సుబ్బారావ్, ఎప్పుడైనా 'జీవాత్మ', 'పరమాత్మ'అనే పదాల్ని విన్నావా?"

"లేదు..."

"జీవాత్మఅంటే భగవంతుని సృష్టి లోని ప్రతి జీవిలోను ఉన్న 'ఆత్మ'. 'పరమాత్మ' అంటే ఆ 'భగవత్‌శక్తి'. ఆ భగవంతుడే 'పరమాత్మ'. సృష్టిలో చలనమున్నవీ, లేనివీ, ప్రతి వస్తువూ

ఆ పరమాత్మునిచేత సృష్టింపబడినవే .. చూడు ... సూర్యభగవానుని స్పర్శతో కమలాలు వికసిస్తుంటయ్...అంటే... సూర్యభగవానుడు 'పరమాత్మ' అన్న మాట. 'కమలం' అతని సృష్టి...అంటే 'జీవాత్మ'. ఆ రెండిటిమధ్య ఎంత దూరముంటుందో తెలుసుగదూ ? అయినా మరి సూర్యుని కిరణాలకు కమలం వికసించటానికి గల కారణం ? ఆ రెండిటిమధ్య గల సంబంధం అవిచ్ఛిన్నమైనది... 'జీవాత్మ' తన వికాసంకోసం అనేక శరీరాలలో ప్రవేశిస్తుంటుంది ఒక శరీరంనుండి వేరొక శరీరంలోకి ప్రవేశించటం మూలంగా తన పరిపూర్ణ ఔచిత్యాన్ని, వికాసాన్ని పొందగల్గుతుంది, తన జీవిత లక్ష్యాన్ని సాధించగల్గుతుంది అట్టి జీవాత్మ వికాసానికి అనుకూల ప్రదేశం ఈ శ్మ...శా.. నమే! అంటే ఈ 'శ్మశానం' మూలంగానే 'పరమాత్మ' కూడ 'జీవాత్మ' సహాయంతో వికాసాన్ని పొందగల్గుతున్నదన్నమాట సృష్టికి మూలమైన పరమాత్మ వికాసానికి పాటుపడే ఈ 'శ్మశానం' పవిత్రమైనదికాదూ ?

"చూడు, ఆ చివర నక్కలెలా కూస్తున్నవో . భయపడిపోయిన ఆత్మలని ఆ కుక్కలెలా వెంబడిస్తూ శ్మశానంలోకి తోలుతున్నవో ఆహా! 'శ్మశానం' ఎంత భారాన్ని సహించి, త్యాగం చేస్తూ ప్రాణులకు సాయపడుతుందో! అటు వంటి 'శ్మశానం' సుందరమైనది కాక, పవిత్రమైనదికాక మరేమిటి? చెప్పు సుబ్బారావ్. ?''

"నన్నేం చెప్పమంటావ్?.. నన్నేం చేయమంటావ్. .ఈ శ్మశానమంటే. అమ్మో . ."వణికిపోయాడు సుబ్బారావ్

"శ్మశానమంటే భయపడేది సామాన్య ప్రజానీకం . . శ్మశానంలో పిశాచాల వికటాట్టహాసాలు వినిపిస్తా యనుకుంటారు.. పుర్రెలు గాలిలో తేలియాడుత వనుకుంటారు ... కొరివి దెయ్యాల వికృతరూపాలు కనిపిస్తా యనుకుంటారు ... అంతా భ్రమ '.. అవన్నీ సంసార బాధలచేత వేధించబడి వేడెక్కిపోయిన మెదడుయొక్క అభూత కల్పనలు ... సుబ్బారావ్ ' నీ కర్తవ్యాన్ని గురించి ఆలోచించుకో.. ' రేపు నువ్వూ ఇలా శ్మశానంలోనే కలసిపోతావ్ ' నీ పార్వతి ప్రక్కనే నువ్వూ మట్టి అయిపోతావ్ '' లే గతాన్ని మరచిపో...నీ పార్వతిలాంటి వాళ్లెందరో ఈ శ్మశానాన్ని కౌగలించుకున్నారు...లే సుబ్బారావ్ ' నేను పోతున్నా...నాకింకో శరీరంలో ప్రవేశించే సమయమొచ్చింది...లే...నాకు సెలవియ్ ... నా కోర్కె తీర్చు ... నీ కన్నీటితో నన్ను బంధించకు పవిత్రమైన శ్మశానంలో నీకంటె ముందుగా కలసిపోయిన నీ'పార్వతి' అదృష్టవంతురాలు . శ్మశానంలో కలసిపోయినవార్ని గురించి ఏమాత్రం చింతించకు వెళ్లు "

రివ్వుమని గాలి వీచింది ..మేఘాలొక్కసారి గర్జించినయ్.

సుబ్బారావులేచాడు ... ఒంటి మీద నుంచి గంపెడు దుమ్ము క్రిందపడింది ధీర్ఘంగా నిట్టూర్చాడు . . తూలుతూ ముందుకుసాగాడు...పట్టుతప్పిన నడక దుమ్ము గొట్టుకుపోయిన వస్త్రాలు. నిజంగా పిశాచంలా ఉన్నాడు సుబ్బారావ్ ఆ శ్మశానంలో

చేతులతో నొసలు పట్టుకుని భారంగా అడుగులు వేస్తున్నాడు మబ్బులు దిట్టంగా క్రమ్మినయ్ మెరపులను అనుసరిస్తున్న ఉరుములు గగుర్పాటును కల్గిస్తున్నయ్ శ్మశానంలో అక్కడక్కడ మండుతున్న చితులు గాలికి ఇంకా వేగంగా రగులుకొంటున్నయ్... ప్రక్కనే ఉన్న జువ్వి చెట్టుమీదనుంచి గుడ్లగూబ అదేపనిగా కూస్తున్నది సన్నగా తుంపర ప్రారంభమైనది . ఒక పెద్దమెరపు . దాని ననుసరించిన భయంకరమైన ఉరుము . 'ఫెళఫెళ' మంటూ విరిగి పడిందొక జువ్వి చెట్టుకొమ్మ.

★